హైదరాబాద్ వార్త





# ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి సన్నాహాలు

**నేటి మధ్యాహ్నం నుంచి దర్శనాలు నిలిపివేయనున్న ఉత్సవ కమిటీ**

**రేపు ఉదయం 6.30 గంటలకు గణేశుడి శోభయాత్ర ప్రారంభం**

**మధ్నాహ్నంలోపు నిమజ్జనం పూర్తయ్యేలా ఏర్పాట్లు**

హైదరాబాద్, సెప్టెంబరు 26,ప్రభాతవార్త: మహా నిమజ్జనానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఖైరతాబాద్ మహాగణతి నిమజ్జనం గురువారం మధ్యాహ్నంలోపు పూర్తయ్యేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు ఇప్పటికే ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులు సమూవేశం నిర్వహించారు. మంగళవారం రాత్రి నుంచే గణపతికి వేసిన షెడ్డు తొలగింపు పనులు ప్రారంభం కాగా ఈరోజు మధ్యాహ్నం 3గంటల నుంచి దర్శనాలు నిలిపివేయనున్నారు. రాత్రికి క్రేన్ సాయంతో విగ్రహాలను ట్రాలీపైకి ఎక్కించి గురువారం ఉదయం 6.30కి శోభయాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. మధ్నాహ్నం 2గంటల లోపు నిమజ్జనం పూర్తయ్యేలా క్యారచరణ రూపొందించినట్లు ఉత్సవ కమిటి నిర్వాహకులు తెలిపారు. ఈశోభయాత్ర ఖైరతాబాద్ టెలిఫోన్ భవన్ మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌వరకు కొనసాగనుంది. ఆతర్వాత వెల్డింగ్ పనులు పూర్తయ్యాక క్రెన్ నెంబర్ 5వద్ద మహా గణపతిని నిమజ్జనం చేయనున్నారు. అలాగే గణేష్ నిమజ్జనం నేపథ్యంలో ఈనెల 29వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నట్లు ట్రాఫిక్‌పోలీసులు తెలిపారు.

# అంబర్‌పేట ముస్లిం శ్మశానవాటికకు శంకుస్థాపన



అంబర్‌పేటలో ముస్లిం స్మశానవాటిక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త : అంబర్‌పేటలో గత కొనేళ్ళుగా కలగానే ఉన్న ముస్లిం స్మశాన వాటిక ఏర్పాటు సాకారం అయ్యింది. మంగళవారం రాష్ట్ర మంత్రి మహమూద్ అలీ, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌లు అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా వద్దగల 120 ఫీట్ రోడ్డుకు అనుకొని ఉన్న మూడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయనున్న ముస్లిం స్మశానవాటిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మహమూద్‌అలీ మట్లాడుతూ ముస్లిం, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కోసం సిఎం కెసిఆర్ నిరంతరం కృషిచేస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వమతాలను గౌరవిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి సిఎం కెసిఆర్ కృషిచేస్తున్నారని చెప్పారు. సర్వమతాలను గౌరవిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరినట్లు అంబర్‌పేటలో మైనార్టీ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో గత 40 ఏళ్లుగా ముస్లిం స్మశాన వాటిక ఏర్పాటు ఒక కలగానే మిగిలిపోయిందని, ముస్లిం సోదరులు దీని కోసం ఎంతగానో మొరపెట్టుకున్నా గత పాలకులు పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. కానీ నేడు సిఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, మహమూద్ అలీ సహకారంతో ముస్లిం స్మశాన వాటిక నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సిఎం కెసిఆర్ నాయకత్వంలో ముస్లిం మైనార్టీలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పదేండ్ల కాలంలో 8,581 కోట్ల రూపాయలను మైనార్టీల సంక్షేమానికి ఖర్చు చేసిందని చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి 2,200 కోట్ల నిధులు కేటాయించి, మరింత ప్రాధాన్యం పెంచిందని పేర్కొన్నారు. షాది ముబారక్, మైనార్టీల బంధు, మైనార్టీ గురుకులాలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు, హజ్ యాత్రికులకు ఏర్పాటు చేయడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హస్సన్, మిర్జా రహ్మత్ బేగ్, జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకటరెడ్డిలు, అధికారులు, మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడికి మద్దతుగా వికలాంగుల నిరసన

ధర్నాచౌక్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త: టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అరెస్ట్‌ను నిరసిస్తూ టీడీపీ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో వికలాంగులు చంద్రబాబునాయుడికి మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోని వికలాంగులు పెద్దఎత్తున హాజరై చంద్రబాబునాయుడికి మద్దతుగా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు అధ్యక్షులు పి.సాయిబాబా హాజరై మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేసిన ప్రజా సేవకుడు చంద్రబాబు నాయుడని కొనియాడారు. దివ్యాంగులకు సమాజంలో సముచిత స్థానం కల్పించాలని, నూతన సాంకే తిక పరిజ్ఞానం అందించాలని దివ్యాంగులకు ప్రత్యేకంగా ఒక డైరెక్టరేటును ఏర్పాటుచేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని గుర్తుచేశారు. నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, పెద్దోజు రవీంద్రాచారి, నగేష్, జి.యాదగిరిరావు, శ్రీనివాస్‌గౌడ్, ఎస్.ప్రకాష్, జోగింధర్‌సింగ్ పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడి అరెస్ట్‌ను నిరసిస్తూ నినాదాలు చేస్తున్న వికలాంగులు, టీడీపీ నేతలు

# ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనాలు జరిపించాలి

**ప్రశ్నార్థకంగా మారిన నిమజ్జనాలు**

**హైకోర్టు ఆదేశాల మేరకు అడ్డుకుంటున్నామంటున్న పోలీసులు**

**తాతల తరాల నుండి వస్తున్న సాంప్రదాయాలనే పాటిస్తాం: భక్తులు**

**ఎటూ తేల్చి చెప్పని ప్రభుత్వం**



నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

ధర్నాచౌక్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త: ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు అడ్డుకోవద్దం టూ భాగ్యనగర్ గణేష్ ఉత్సవసమితి నేతలు విన్నవించి నప్పటికీ ట్యాంక్‌బండ్‌పై గణేష్ నిమజ్జనాలు ప్రశ్నార్థకంగా మారాయి. తరతరాలుగా ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనాలు చేస్తున్నాం ఇప్పుడూ ఇక్కడే చేస్తామని భక్తులు అంటున్నప్పటికీ, హైకోర్టు ఆదేశాల మేరకు ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ నేతలు కొందరు ట్యాంక్‌బండ్‌పై గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రయత్నించటంతో పోలీసులు అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. తర తరాలుగా మా తాత ముత్తాతల నుండి ఇక్కడే చేస్తున్నాం, ఇప్పుడూ ఇక్కడే చేస్తామంటూ వారు పట్టుపట్టటంతో పోలీసులకు బీజేపీ నేతలకు వాగ్వివాదం జరిగింది. హైకోర్టు స్టే ఉండగా చేయటానికి వీలు లేదని పోలీసులు అనుమతించకపోవటంతో వారు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీనితో అక్కడ కొంత ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకోవటంతో పోలీసులు వారిని దోమలగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, పరిస్థితి అదుపులోకి తెచ్చారు. మూడు నాలుగు రోజులలో దాదాపు జరగబోయే నిమజ్జనానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి దాదాపు 15 వేల వరకు విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పైకి వచ్చే అవకాశం ఉంది. ఒకవైపు హైకోర్టు స్టే, మరోవైపు ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనాలు చేస్తామంటున్న భక్తులు, ఎటూ తేల్చి చెప్పని ప్రభుత్వంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. వినాయకచవితి మర్నాటి నుండే ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలు చేసేందుకు విగ్రహాలు వస్తూ ఉంటాయి, ఈ క్రమంలో హైకోర్టు స్టేతో ట్యాంక్ బండ్‌పై క్రేన్‌లు ఏర్పాటు చేయకపోవటంతో నిమజ్జనాలు పోలీసులకు ఒక సవాల్‌గా మారింది.

# డబుల్ బెడ్ రూం లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలు పంపిణీ



డబుల్‌బెడ్ రూం ఇండ్ల లబ్దిదారులకు కేటాయింపు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని, కలెక్టర్

బేగంపేట సెప్టెంబరు 26,ప్రభాతవార్త : పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్త శుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేసారు. మంగళవారం సికింద్రాబాద్ లోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సనత్‌నగర్ కంటోన్మెంట్ నియోజక వర్గాల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లలో అర్హులైన లబ్దిదారులు 103 మందికి ఇండ్ల కేటాయింపు పత్రాలను మంత్రి శ్రీనివాస్ యాదవ్ పంపిణీ చేసారు. అదే విధంగా దివ్యాంగులకు 3016 రూపాయల పెన్షన్ 4016 రూపాయలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రభుత్వం పెంచగా అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అందజేసారు. నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ నగర్ లో నిర్మించిన డబుల్ బెండ్ రూం ఇండ్లలో 42మందికి ,బండ మైసమ్మ నగర్‌లో 29,పొట్టి శ్రీరాములు నగర్ లో 15,మడ్ ఫోర్డ్‌లో 8,మారేడుపల్లి లో 9మందికి ఇండ్లను కేటాయిస్తూ పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడు తూ పేద ప్రజల సొంత ఇంటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆర్డీవో రవి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందిత, తహాశీల్దార్‌లు. లబ్దిదారులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని నిమజ్జనానికే విఘ్నాలా?

**ట్యాంక్‌బండ్‌పై అనుమతించని హైకోర్టు**

**వినాయకసాగర్‌లోనే చేస్తామంటున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి**



ధర్నాచౌక్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త: హైదరాబాద్ నగరం అంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వినాయక నిమజ్జన కార్యక్రమం సమీపిస్తున్న వేళ ఆ విఘ్నేశ్వరుని నిమర్జనానికి మళ్లీ విఘ్నాలు మొదలయ్యాయి. వినాయక్‌సాగర్‌లో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు హైకోర్టు అనుమతి నిరాకరించటంతో నిమజ్జనాలపై సందిగ్ధత నెలకొంది. వినాయక్‌సాగర్‌లో నిమజ్జనాలను ఆపివేయాలని, వాటికి ప్రత్యామ్నాయంగా పలుచోట్ల టబ్‌లను ఏర్పాటుచేసి నిమజ్జనంకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినప్పటికీ, భక్తులు మాత్రం వినాయక్ సాగర్‌కే మక్కువ చూపుతూ ఉండటంతో సమస్య ఏర్పడింది. తర తరాలుగా నిజాం కాలం నుండి కూడా వినాయక్‌సాగర్‌లో నిమజ్జనాలు చేస్తూ ఉంటే ఇప్పుడు వచ్చిన తెలంగాణ ప్రభుత్వం వినాయక్‌సాగర్‌లో నిమజ్జనాలను అడ్డుకుంటోందని గణేష్ భక్తులు వాపోతున్నారు. ఎంతో ఉత్సాహంగా ఒక పెద్ద పండుగలా పెద్ద ఎత్తున జరుపుకునే గణేష్ నిమజ్జనం నిర్వీర్యం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. కరోనా సమయంలో ఆంక్షలు విధించటం సబబే కానీ ఇప్పుడు సాధారణ పరిస్థితులు నెలకొన్నా కూడా ఇంకా నిమజ్జనంపై ఆంక్షలు విధించటాన్ని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు, బీజేపీ నేతలు, గణేష్ మండపాల నిర్వా హకులు తీవ్రంగా నిరసిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రారంభం అయిన నిమజ్జనాలకే గందరగోళ పరిస్థితి ఏర్పడితే ఈనెల 28న నిమజ్జనంరోజు లక్షలాది మందితో తరలివచ్చే వేలాది విగ్రహాల నిమజ్జనాల పరిస్థితి ఏమిటోనని పోలీసులు సైతం తలలు పట్టుకుంటున్నారు.

**భక్తుల మనోభావాలు దెబ్బతీయవద్దు**

**ఏ.వినయ్‌కుమార్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్**



హిందూ పండుగలు అనగానే కొత్త కొత్త నిబంధనలు తీసుకువస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. నిజాం పాలనలో సైతం లేని నిబంధనలు, ఇప్పుడు మన రాష్ట్రంలో తెలంగాణ పాలనలో పెట్టటం దురదృష్టకరం. గత రెండు సంవత్సరాలుగా వినాయక్‌సాగర్‌లో నిమజ్జనాలను అడ్డుకోవటానికి తెలంగాణ ప్రభు త్వం ప్రయత్నించటం సరియైనది కాదు. భక్తు మనోభావాలను దెబ్బతీయకుండా వినాయక్‌సాగర్‌లో నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలి.

**నిమజ్జనం ఆనందంగా జరిగే ఏర్పాట్లు చేయాలి**

**శ్రీకాంత్, శ్రీనివాస వెల్ఫేర్ అసోసియేషన్ గణేష్ మండప నిర్వాహకులు**



గణేష్ నిమజ్జనం ఆనందంగా జరుపుకునే ఏర్పాట్లు చేయాలి, కానీ గత రెండు సంవత్సరాలుగా గందర గోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. నిమజ్జనం గురించి పూర్తి సమాచారం ఎవరూ ఇవ్వటం లేదు. ఎన్టీఆర్ స్టేడియంలో టబ్‌లు ఏర్పాటుచేశాం నిమజ్జనం చేసుకోవచ్చని చెప్పారు. మా వినాయక విగ్రహం ఎన్టీఆర్ స్టేడియంకి తీసుకుపోతే పోలీసులు అడ్డుకున్నారు. కేవలం ఇక్కడ ఐదు అడుగుల లోపు విగ్రహాలనే అనుమతిస్తామని పోలీసులు అడ్డుకోవటంతో, ట్యాంక్‌బండ్‌కి తీసుకుపోయాము. ట్యాంక్‌బండ్‌పై క్రేన్‌లు ఏర్పాటుచేయకపోవటంతో అక్కడ నుండి మళ్లీ అంత పెద్ద విగ్రహాన్ని తీసుకుని నెక్లెస్ రోడ్డుదాకా తీసుకువెళ్లటం చాలా సమస్య అయింది.

# ఆర్థిక మూలాలు, కేసులపై ప్రభుత్వం నజర్

**మైనంపల్లి అనుకూల అధికారుల బదిలీలు**

**కార్పొరేటర్లు, క్యాడర్ చేజారకుండా చర్యలు**

**మర్రి బరిలో ఉంటే ప్రధాన అంశంగా మారనున్న రెండు టిక్కెట్లు వ్యవహారం**



హైదరాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: రాజకీయంగా, అర్థికంగా ఇరుకున పెట్టేందుకు భారీ ప్రణాళికలనే రచిస్తోంది. ఎమ్మెల్యేకు అనుకూల అధికారులు అనే ముద్రతో పోలీసు, జిహెచ్ఎంసి విభాగాలులో పని చేస్తున్న వారిని ఇప్పటికే ప్రభుత్వం బదిలీ చేసింది. కార్పొరేటర్లు, క్యాడర్ చేజారకుండా కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించింది. వ్యాపారాలు, కేసులు, రియల్ వివాదాలను బయటకి తోడాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం. ప్రధానంగా మైనంపల్లి ఆర్థిక మూలాలుతో పాటుగా కేసులుపై దృష్టి సారించినట్లు తెలిసింది. రియల్ వ్యాపారాలకు సంబంధించిన సమచారాన్ని ఇంటిలిజెన్స్ నుంచి సేకరిస్తోంది. ప్రధానంగా భూ వివాదాలు ఇటీవల కొన్ని తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. బందు వర్గం, స్నేహితులు రియల్ వివాదాలులో చిక్కుకున్న ప్రతిసారి ఎమ్మెల్యే పేరు ప్రధానంగా తెరపైకి వస్తోంది. ఇదే విషయాన్ని పలుమార్లు ఆయన ఖండించడం జరిగింది. ఎటువంటి ప్రమేయం, పాత్ర లేని వాటిలో తన పేరును లాగడం భావ్యం కాదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ నుంచి బయటకి వచ్చిన నాటి నుంచి తెర వెనుక ఏదో జరుగుతోందని ఆయన క్యాడర్ విశ్వసిస్తోంది. ఎమ్మెల్యే వైపు వెళ్ళవద్దని భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని అధిష్టానం భరోసా కల్పిస్తోంది. మల్కాజిగిరిలోని ఓ మాజీ ప్రజా ప్రతినిధిని కేసులు ఉన్నాయని ఆలోచించుకోవాలని వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండున్న సంవత్సరాలు పదవీ కాలం ఉన్న నేపథ్యంలో అండగా ఉంటామని పలువురు కార్పొరేటర్లకు ప్రభుత్వంలోని పెద్దలకు అనునూయులుగా వ్యవహరించే నేతలు ఫోన్‌లు చేసి చెబుతున్నారు. మైనంపల్లి వెంట వెళితే ఆర్థికంగా, రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని నేతలులో భయాం దోళనలు నెలకుని ఉన్నాయి. మల్కాజిగిరి నియోజకవర్గంలోని ఎనిమిది డివిజన్లులో ఆరుగురు బిఆర్ఎస్ కార్పొరేటర్లు ఉన్నారు. అల్వాల్ సర్కిల్ నుంచి ముగ్గురు, మల్కాజిగిరి సర్కిల్‌లో ముగ్గురు ఉండగా వీరిలో ఇద్దరు మైనంపల్లి వెంట వెళ్ళడానికి నిర్ణయించుకు న్నారు. నలుగురు కార్పొరేటర్లు డైలామాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే వెంట వెళితే వ్యాపారాలు ఇతర వ్యవహారాలులో నష్ట పోతామనే భయం ఒకరిద్దరిలో కనపడుతోంది. స్వస్థలమైన అల్వాల్ సర్కిల్‌లోని ముగ్గు రు కార్పొరేటర్లులో ఇద్దరు బిఆర్ఎస్ పార్టీలో కొనసాగ డానికి నిర్ణయించుకోవడం కొసమెరుపు. ఒక విధంగా ఈ పరిణామం మైనంపల్లికి మింగుడు పడని అంశమే. కార్పొరేటర్లు పరిస్థితి ఇలా ఉండగా అధిక శాతం కింది స్థాయి క్యాడర్ మైనంపల్లికి అండగా నిలిచే అవకాశాలు ప్రస్తుత పరిస్థితిలో కనపడుతున్నాయి. కార్పొరేటర్లు స్వార్థపరులు అంటూ కార్యకర్తలు బహిరంగంగా విమర్శి స్తున్నారు. రాజకీయ బిక్ష పెట్టిన మైనంపల్లికి కష్ట కాలంలో అండగా ఉండాల్సింది పోయి స్వలాభం కోసం పాకులాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొడుకు కోసం ఆయన పార్టీని వీడడం కూడా సబబుకాదనే వారు ఉన్నారు.

ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, జిహెచ్ఎంసి అధ్యక్షుడిగా అనేక అవకాశాలు కల్పించిన విషయాన్ని మరువరాదని పేర్కొంటున్నారు. పార్టీకి రాజీ నామా, టిక్కెట్‌ను తిరస్కరిస్తున్నట్లు స్వయంగా సీఎంకు ఫ్యాక్స్ ద్వారా లేఖను ఎమ్మెల్యే పంపించారు. మల్కా జిగిరి టిక్కెట్ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డికి అనధికారంగా ఖరారైన నేపథ్యంలో ఆయన స్థానికంగా పర్యటనలు చేస్తున్నారు.



మణికొండ మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల వైద్య శిబిరంలో బీపీ పరీక్షించుకుంటున్న కమీషనర్ పల్గున్ కుమార్

## కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : కమిషనర్

నార్సింగి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : శానిటేషన్ కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మణికొండ మున్సిపల్ కమీషనర్ ఫల్గుణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద శానిటరీ కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరంను ఏర్పాటు చేశారు. కమీషనర్ పల్గుణ్ కుమార్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు తమ బీపీలను పరీక్షించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజలందరి ఆరోగ్యంను కాపాడేందుకు నిత్యం చెత్త ఎత్తుతూ, డ్రైనేజీలు మరమ్మత్తు చేసే కార్మికులు మీ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పురుషోత్తం, శ్వాత బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాలాల నరేష్, నాయకులు రవికాంత్‌రెడ్డి, కిరణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండోలో సత్తా చాటిన గిన్నె లిఖిత సాగర్

**నేపాల్ ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్‌లో గోల్డ్ మెడల్ కైవసం**



గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్న లిఖిత సాగర్

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త : తెలంగాణ ప్రాంత విద్యార్థిని గిన్నె లిఖిత సాగర్ నేపాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో విజయం సాధించి గోల్డ్ మెడల్‌ని కైవసం చేసుకుంది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ ప్రాంతానికి చెందిన గిన్నె శ్రీనివాస్ సాగర్ కుమార్తె గిన్నె లిఖిత సాగర్ ఆల్ ఇండియా నేపాల్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. అంతేకాకుండా ఇదే పోటీల్లో నెగ్గడంతో సింగపూర్‌లో జరిగే ఏషియన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు సెలెక్ట్ అయ్యింది. తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల్లో విజయం సాధించి బంగారు పతకాన్ని సాధించడం పట్ల జగద్గిరిగుట్ట సగర సంఘం నాయకులు లిఖిత సాగర్‌ని ప్రత్యేకంగా అభినందించారు. దేశం గర్వపడే విధంగా రాణించాలని వారు స్పష్టం చేశారు. గోల్డ్ మెడల్ సాధించి హైదరాబాద్‌కి తిరిగి రావడంతో వారి కుటుంబ సభ్యులు లిఖిత సాగర్‌ని ఎయిర్‌పోర్ట్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు.

## నేషనల్ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలి

**ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ జీఎస్ శివ గోపాల్ మిస్రాజీ**




సెమినార్‌లో పాల్గొన్న నేతలు

కంటోన్మెంట్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ఓపీఎస్‌ను తిరిగి తీసుకురావడానికి దేశంలో పెద్ద సమ్మెకు రైల్వే కార్మికులు సిద్ధం కావాలని ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ జీఎస్ శివ గోపాల్ మిస్రాజీ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ నేషనల్ పెన్షన్ స్కీమ్ రద్దు, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణపై రైల్‌కళారంగ్‌లో జోనల్ లెవల్ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో పెద్దయెత్తున రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు. పాత పెన్షన్ స్కీమ్‌ను కొనసాగించడానికి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానకార్యాదర్శి శంకర్‌రావు, ఏజీఎస్ రవీందర్ ఇతర నేతలు పాల్గొన్నారు.

## లారీని వెనుకనుంచి ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి



మృతుడు జీవన్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: అకస్మాత్తుగా స్లోచేసిన లారీని వెనుకనుంచి కారు ఢీకొన్న సంఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి గ్రామం పీఅండ్‌టీ కాలనీకి చెందిన సింగిరెడ్డి నాగేందర్‌రెడ్డి కుమారుడు సింగిరెడ్డి జీవన్‌రెడ్డి(23) వ్యాపారం నిర్వహిస్తుంటాడు. ఈనెల 25న మధ్యాహ్నం స్విఫ్ట్‌కారులో ఇంటినుంచి బయలుదేరి ఔటర్‌రింగ్‌రోడ్డు మీదుగా చంద్రాయణగుట్టకు వెళ్తుండగా ఎగ్జిట్‌నెంబరు 10 సమీపంలో ముందు వెళ్తున్న కంటైనర్ లారీ(ఎపి29టీఎ6541) డ్రైవర్ అకస్మాత్తుగా లారీని స్లోచేయగా.. కారు లారీని వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుబాగం లారీ కిందకు వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన జీవన్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



హాయత్‌నగర్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన హాయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... హయత్‌నగర్‌లో శ్రీనివాస ఆసుపత్రి సమీపంలో ఈనెల 26న ఉదయం 5.30 గంటలకు రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా... అతని జేబులోని ఔట్‌పేషంట్ స్లిప్ ఆధారంగా పోలీసులు అతని పేరు నర్సింహాగా, అతను గాంధీ ఆసుపత్రికి తరుచుగా వైద్యం కోసం వెళ్తున్నట్లుగా భావిస్తున్నారు. మృతుడి సంబంధీకులు వివరాలకు పోలీస్‌స్టేషన్‌లో నేరుగా కానీ 8712662301 నెంబరును సంప్రదించాలని సూచించారు.

## వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ : ఎమ్మెల్యే కృష్ణారావు



చాకలి ఐలమ్మకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త : వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని చాకలి బస్తీలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ ప్రతిపక్ష నాయకురాలిలా వ్యవహరించడం సరియైనది కాదు

**దూదిమెట్ల బాలరాజు యాదవ్**

మెహిదీపట్నం, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త : రాజ్యాంగ వ్యవస్థలో ఉంటూ, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వారు రాజకీయాలు చేయడం సరియైనది కాదని తెలంగాణ షిప్ అండ్ గోట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్.దూదిమెట్ల బాలరాజు యాదవ్ హితవుపలికారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రతి పక్ష నాయకురాలిలా వ్యవహరించడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమన్నారు. తెలంగాణ ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదం తో పంపిన ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆమోదించకుండా తిరస్కరించడంతో మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలంలో విలేకరులతో మాట్లాడారు. బిజెపి పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన తమిళసై తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా పనిచేయవచ్చుగాని సామాజిక హోదాలో సమాజ హితం కోసం పనిచేస్తున్న దాసోజు శ్రావణ్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా ఆమోదిం చక పోవడం శోచనీయమన్నారు. బిసి బిడ్డ అయిన దాసోజు, ఎస్టీ బిడ్డ అయిన కుర్రా సత్యనారాయణలను గవర్నర్ అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి. ఎస్టీల బిడ్డలు రాజ్యాంగ బద్ధ పదవులు చేపట్టకూడదా అంటూ ప్రశ్నించారు. తమిళనాడులో బిసి, ఎస్టీలపై వివక్ష చూపిన విధంగానే తెలంగాణలో కూడా బిసి. ఎస్టీలపై గవర్నర్ వివక్షను చూపించాలను కోవడం దురదృష్ట కరమన్నారు.

## కలిసి మెలిసి పని చేయండి

**హోం మంత్రి మహమూద్ అలీ**



అల్వాల్. సెప్టెంబరు 26 ప్రభాతవార్త: మల్కాజిగిరి టిక్కెట్ ఎవరికి ఇచ్చినా కలిసి మెలిసి పని చేయాలని రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మంగళవారం అల్వాల్ వచ్చిన ఆయన ఉద్యమకారుడు శ్రీనివాస్ గౌడ్‌ను కలవడం జరిగింది. ఉద్యమ సమయంలో శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి మెలిసి పని చేసిన అనుబంధం ఉందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి రాజీనామా తరువాత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అధిష్టానం టిక్కెట్ ఎవరికి ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం నేతలు, కార్యకర్తలు పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యురాలు జ్యోతి శ్రీనివాస్ గౌడ్, ఎసిపి వెంకట్‌రెడ్డి, అల్వాల్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కిషోర్, ట్రాఫిక్ సిఐ నాగేశ్వరరావు బిఆర్ఎస్ నేతలు బస్వరాజ్, ఆనంద్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## దీన్‌దయాల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : ఆదం విజయ్

అడ్డగుట్ట,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు పండిత్ దీన్‌దయాల్, ఉపాధ్యాయ దేశానికి చేసిన సేవలు అమోఘమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదం విజయ్‌కుమార్, కిసాన్ మోర్చా కన్వీనర్ సి.హెచ్. కన్నాభిరామ్‌లు తెలిపారు. దీన్‌దయాల్ జయంతిని పురస్క రించుకొని మంగళవారం అడ్డగుట్టలోని బిజెపి కార్యాల యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు జి.నరేందర్, వేణు, రవిందర్, సాయి బాబా, మహేందర్, శంకర్ రాజ్, కళావతి, గెల్లు ఉదయ్ యాదవ్, శ్రీధర్ పాల్గొన్నారు.

## నేషనల్ హార్టికల్చరల్ బోర్డు డైరెక్టర్‌గా వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : నేషనల్ హా ర్టికల్చరల్ బోర్డు డైరెక్టర్‌గా హైదరాబాద్ నగరం, ఎల్‌బినగర్ నియోజకవర్గం, వనస్థలిపురంలో నివాసముంటున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ నియామకపు ఉత్తర్వులను అందేజేసారు. ఈ నియామకపు పత్రాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీనివాస్‌రెడ్డికి అందజేసారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఓబిసి మోర్చ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్,బిజెపి నాయకురాలు డాక్టర్ సుస్మిత శంకర్ రావ్ తదితరులు







బోయిన్‌పల్లి చౌరస్తాలో విద్యా గణపతి మండపంలో పూజలు చేస్తున్న డిసిపి చందనా దీప్తి తదితరులు, 5వ వార్డు గణేష్ మండపంలో పూజలు చేస్తున్న శ్రీగణేష్ తదితరులు, మానస సరోవర్ హైట్స్ ఫేస్3లో వినాయక పూజలో పాల్గొన్న భక్తులు







పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర, గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి, గంధంగూడలోని ఏకదంతుడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, బిఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పోరేటర్లు సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సాగర్‌గౌడ్, నాయకులు పాండు, పెంటయ్య, వెంకటేష్







వినాయక పూజల్లో పాల్గొన్న ఎంఆర్‌పిఎస్ నాయకులు పి.రవిమాదిగ, పూజలో పాల్గొన్న బిఆర్ఎస్ ఉద్యమనేత ఆర్వీమహేందర్‌కుమార్, వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని నాంపల్లి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో నెలకొల్పిన మండపాల్లో సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.టిఆర్ఎస్ నాయకులు ప్రమోద్ కుమార్ అగర్వాల్

# గంగమ్మ పుత్రుడికి ఘనంగా పూజలు

**విఘ్నేశ్వరుడిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయి : చందనా దీప్తి**

**కంటోన్మెంట్,..** విఘ్నేశ్వరుడిని వేడుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఉత్తర మండలం డిసిపి చందనా దీప్తి తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవా లను పురస్కరించుకొని బోయిన్‌పల్లి చౌరస్తా సమీపంలో రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ప్రతిష్టించిన విద్యా గణపతి మండపంలో నిర్వహిం చిన పూజా కార్యక్రమాలకు అమె ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ శాలువకప్పి జ్ఞాపికను అందజేసి శాలువకప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి మధుసూదన్ రావ్, యాదవ సంఘం ప్రతినిధులు విట్టల్ రావ్, దయానంద్, సంతోష్ యాదవ్, రాము గౌడ్,రవిందర్, జంపన రవి తదితరులు పాల్గొన్నారు.

**గణేష్ పూజల్లో పాల్గొన్న శ్రీగణేష్**

కంటోన్మెంట్ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్.జి.ఎఫ్.అధినేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్స వాలను పురస్కరించుకొని కంటోన్మెంట్‌లోని మారే డ్‌పల్లి, గాంధీ నగర్, తాడ్‌బండ్, బాపూజీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు సన్నీ, క్రాంతి, శ్రీనివాస్, పిలిప్స్,రాకేష్, ప్రవీణ్, ఖాజా, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో గణనాథుడి పూజలు,**

**చార్మినార్..** క్రాంతి యూత్ అసోసియేషన్ లాల్‌దర్వాజ పూలబండ శ్రీ వీరాంజనేయ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడికి గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర విచ్చేసి ప్రత్యేక పూ జలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అర్జున్, మహేష్, నర్సింగ్, సంతోష్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు. ఆలె జితేంద్రను బిజెపి నాయకులు బి.రమేష్ యాదవ్ సన్మానించారు.

**లంబోదరుడి కృపాకటాక్షాలు**

**కూకట్‌పల్లి ప్రజలపై ఉండాలి : వడ్డేపల్లి**

**కూకట్‌పల్లి..** లంబోదరుడి కృపాకటాక్షాలు కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధి లోని సాయిబాబా నగర్ కాలనీలో చంద్రప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావుకి తన మిత్ర బృందంతో చంద్రప్రకాష్‌రెడ్డి కేరళ డ్రమ్స్, నాసిక్ డోల్, బ్యాండ్ మేళం, డప్పు చప్పుళ్ళతో వివిధ కళా బృందా లచే ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులుతోపాటు కాలనీ వాసులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**బేగంబజార్..** బేగంబజార్ డివిజన్‌లోని ఫీల్‌ఖానా అశోక్ మార్కెట్ అశోక్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మండపం గోషామహల్ నియోజకవర్గం ఎంఆర్‌పిఎస్ ఇన్‌చార్జ్ పూజల్లో రవిమాదిగ ప్రత్యేక పూజలను చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకోవాల న్నారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రధాన రహదారులలో ఊరేగింపుకు ఇబ్బందులు కలుగు కుండా పనులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో యోగేష్ వ్యాస్,కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొ న్నారు భక్తులకు అన్నదానం చేశారు. గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్ ప్రత్యేకపూజలు చేశారు. ఈకార్యక్రమలో బిఆర్ఎస్ నాయకులు శైలేందర్‌కురుమ, పప్పు పాల్గొన్నారు.

**బేగంబజార్..** వినాయక ఉత్సవాలను పురస్కరించు కుని గోషామహల్ నియోజకవర్గంలో పలు ప్రాంతాలల్లో ఏర్పాటు చేసిన మండపాలల్లో అత్యంత వైభవంగా పూజలను జరుగుతున్నాయి.బేగంబజార్, మంగళ్‌హాట్, సుల్తాన్‌బజార్ తదితర ప్రాంతాల్లో గోషామహల్ నియోజక వర్గం బిఆర్ఎస్ ఉద్యమ నేత ఆర్వీ మహేందర్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆర్వీమహేందర్‌కుమార్‌ను శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

**యూసుఫ్‌గూడ..** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బోరబండ మోతీనగర్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవి సోసైటీ ప్రాంగణంలో వినాయక చవితి ఉత్సవాలు గణంగా నిర్వహించారు. ప్రతి రోజు గణపతి హోమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఏడవరోజు నిమర్జనం సందర్భంగా గణేష్ లడ్డు వేలం పాట నిర్వహించారు. దీనిలో సంఘం సభ్యులు దిడిగం సురేష్ కుమార్ గుప్త దంపతులు రూ.4,59,000 లకు లడ్డును దక్కించుకుని విజేతగా నిలిచారు. ఈకార్యక్రమంలో చైర్మన్ శ్రీఇల్లూరి లక్ష్మీనారాయణ గుప్త, వైస్‌చైర్మన్ శ్రీఅనుమాల శెట్టి నారాయణ గుప్త, అధ్యక్షులు శ్రీ రతకంటి సాయిబాబా గుప్త, ప్రధాన కార్యదర్శి శ్రీకైలాస శ్రీనివాస్ గుప్త, కోశాధికారి శ్రీకొ క్కొండ ప్రేమ కుమార్ గుప్త, ఐపిపి శ్రీజైని లక్ష్మణ్ గుప్త, సంఘం కార్యకర్త సభ్యులు, మహిళా సంఘం, యువజన సంఘం సభ్యులు, పరిసర ప్రాంతాల ఆర్యవైశ్య సోదర సోదరీ మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పర్వత్‌నగర్ ఫేస్ 2లో..** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పర్వత్‌నగర్ ఫేస్ 2లో శ్రీఆదిదేవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెటిల్ కోర్టు ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన గణేషుని మండపం వద్ద నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్ పాల్గొన్నారు.అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో పర్వత్‌నగర్ అధ్యక్షులు జాహేద్ షరీఫ్, సుంకన్న, సాయికుమార్, మహేష్, పవన్, చందు, సంజయ్, శివ, నాని, వేణు,విశాల్, తదితరులు పాల్గొన్నారు.

**వివేకానంద నగర్ కాలనీలో..** వివేకానంద నగర్ కాలనీలో వివేకానంద సేవా సమితి ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఓబిసి మోర్చ బిజెపి ఉపాధ్య క్షులు పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, గంగుమళ్ళ సేవాసమితి నిర్వాహకులు గంగుమళ్ళ వరప్రసాద్ సుజాత దంపతులు పాల్గొని గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో పేదలకు అన్నదానం**

**చిక్కడపల్లి..** ప్రజల్లో ఆధ్యాత్మికభావాలు వెల్లివిరియా ల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మిగణపతి దేవాలయం పూర్వ చైర్మన్ బిఎన్.శ్రీనివాసరావు యాదవ్ అన్నారు. భక్తిభావం పెరిగితే ప్రజల్లో మానసిక ప్రశాంతత నెలకొని ఉంటుందని అన్నారు. ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శ్రీనివాస్‌రావు యాదవ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఎన్.శ్రీనివాస్ రావు యాదవ్ సతీమణి భానుప్రియ, మాతృమూర్తి సత్యమ్మ, కుమారుడు, నితిన్‌యాదవ్,కుమార్తెలు శ్రియ, అక్షిత, శ్రీవైష్ణవి, జాహ్నవి, ఆల యం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి, ధర్మకర్త రమణమూర్తి, భక్తబృందం సభ్యులు గజానంద్, మణి తదితరులు పాల్గొన్నారు.



బోరబండ,మోతీనగర్ ఆర్యవైశ్య సంఘం శ్రీవాసవి సోసైటీ వినాయక మండపం వద్ద 4,59,000లకు లడ్డును దక్కించుకున్న సురేష్ కుమార్ గుప్త



పర్వత్‌నగర్ ఫేస్ 2లో ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన గణనాధుని పూజ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి గౌసుద్దీన్



వివేకానంద నగర్ సేవాసమితి గణేష్ మండపంలో పూజల్లో పాల్గొన్న ఓబిసి మోర్చ బిజెపి ఉపాధ్యక్షులు పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, గంగుమళ్ళ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గంగుమళ్ళ వరప్రసాద్ సుజాత దంపతులు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయం మాజీ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావు యాదవ్

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో నేత్రపర్వంగా గణపతి నవరాత్రోత్సవాలు**

**చిక్కడపల్లి..** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీలక్ష్మీగణపతి దేవాల యంలో జరుగుతున్న నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆలయం పూర్వ చైర్మన్ బిఎన్.శ్రీనివాసరావు యాదవ్ దంపతులను ఆలయం ఈవో లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. ఆలయంలో నవరాత్రోత్సవాల్లో భాగంగా నిత్యం జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఒక రోజు కార్యక్రమానికి దాతగా సహకరించినందుకుగాను సత్కరించారు.

## మహిళ ర్యాష్ డ్రైవింగ్

**గార్డెనింగ్ కార్మికురాలి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు**

గచ్చిబౌలి, సెప్టెంబరు 26 ప్రభాతవార్త : ఓ మహిళ కారు ర్యాష్ డ్రైవింగ్ కారణంగా ఇద్దరు మహిళా కార్మికుల కుటుంబాల్లో విషాదం నింపింది. నిర్లక్ష్యంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో గార్డెనింగ్ పనులు చేస్తున్న మహిళా కార్మికుల్లో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నారాయణపేట పరిధిలోని నిజ్జంత గ్రామానికి చెందిన కోటకొండ జయమ్మ(50) నగరానికి వలస వచ్చి కుటుంబంతో మణికొండలో నివాసం ఉంటుంది. గత నాలుగేళ్లుగా ల్యాంకోహిల్స్‌లో గార్డెనింగ్ పనులు చేస్తున్న జయమ్మ, పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు ల్యాంకోహిల్స్ విల్లాస్ సమీపంలోని రోటరీలో గార్డెనింగ్ పనులను చేస్తుంది. జయమ్మతో పాటు మరో కూలీ పద్మ(34), మరికొందరు మహిళా కూలీలు గార్డెనింగ్ పనుల్లో ఉన్నారు. అదే సమయంలో ల్యాంకో హిల్స్ రహదారి మీద వెళ్తున్న ఓ ఐ20 కారు అదుపు తప్పి వేగంగా వచ్చి గార్డెనింగ్ చేస్తున్న మహిళా కూలీలను ఢీకొట్టింది. ఉదయం జిమ్‌కు వెళ్లి వస్తున్న దీప్తి అనే మహిళ కారును నిర్లక్ష్యంగా, వేగంగా నడుపడంతో అదుపుతప్పిన కారు కూలీలను ఢీకొట్టి, డివైడర్ మీదకు ఎక్కింది. ఈప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో జయమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మరో కూలీ పద్మకు సైతం తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు కారు నడిపిన దీప్తిని సైతం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి

**సంతోష్ యాదవ్**

అడ్డగుట్ట,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజిం చాలని మారేడ్‌పల్లి శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయం చైర్మన్ సి.సంతోష్ యాదవ్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రెజిమెంటల్ బజార్‌లో ప్రతిష్టించిన గణేష్ మండపంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శివకుమార్, బిఆర్ఎస్ నాయకులు ఉమా శంకర్,రాము, ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు జడ్పీ మాజీ వైస్‌చైర్మన్, మాజీ ఎంపిటిసి రాజీనామా

దుండిగల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ఉమ్మడి రంగారెడ్డిజిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, దొమ్మరపోచంపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి తలారి యాదగిరి బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామ చేశారు. ఈమేరకు మంగళవారం తమ రాజీనామ లేఖను అధిష్టానం పంపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీలో పదేళ్ళుగా క్రియాశీలకంగా పనిచేశాము. సముచిత స్థానం లభించకపోగా అవమానాలకు గురి చేశారు. ఇక భరించేలేక పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. బుధవారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

## మహాలయ అమావాస్య, త్రిశక్తి పీఠాలకు భారతీయ రైల్వే ప్రత్యేక రైళ్లు

నాంపల్లి, సెప్టెంబరు 26 ప్రభాతవార్త : అత్యంత విజయవంతమైన భారత్ గౌరవ్ రైల్ పథకం కింద మహాలయ అమావాస్యకు, త్రిశక్తి పీఠ యాత్రలకు భారతీయ రైల్వే ఉలారైల్ ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు ట్రావెల్‌టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ మీడియాకు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాలయ అమావాస్య ప్రత్యేక రైలు ప్రయాగ-వారణాసి-గయ-అయోధ్య-హరిద్వార్-ఢిల్లీ-మధుర-ఆగ్రాలమీదుగా నడవనుందని, ఈ రైలు అక్టోబరు 10న బయలుదేరి 11న తెలంగాణలో ప్రవేశిస్తుందని తెలిపారు. తెలంగాణలోని మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్లలో భక్తులు ఈ రైలును ఎక్కవచ్చన్నారు. ఈ ఉలారైలులో దారిపొడవునా యాత్రా విశేషాలను వివరించే పిఏ సిస్టమ్స్, సిసిటివి కెమెరాలు, కోచ్‌సెక్యూరిటీ, టూర్ మేనేజర్లు, ట్రావెల్ ఇన్సూరెన్స్, హోటళ్లు, సందర్శనా, రవాణా సదుపాయాలు ఉన్నాయన్నారు. ముప్పూటలా దక్షిణ భారత భోజనంతోపాటు యాత్రికులకు ఎల్టీసి, ఎల్ఎఫ్సీ, వివిధ రకాల సౌకర్యాలను కూడా పొందవచ్చని వివరించారు. త్రిశక్తిపీఠ్ యాత్రారైల్ కోలకత్తా-కామాఖ్య-పూరి-భువనేశ్వర్ మీదుగా నడువనుందని, అక్టోబరు 27న ప్రారంభమవుతుందని, నాలుగు శక్తిపీఠాలను సందర్శించనున్న ఈ రైలు కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి భక్తులు రావచ్చన్నారు.

## అమరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**ఉద్యమకారుల సంక్షేమసమితి రాష్ట్ర అధ్యక్షులు రూబి స్టీవెన్‌సన్**



సమావేశంలో మాట్లాడుతున్న స్టీవెన్‌సన్, వెంకన్న తదితరులు

హైదరాబాద్, సెప్టెంబరు 26,ప్రభాతవార్త: తెలంగాణ సాధనలు ప్రాణాలు కోల్పోయిన అమరుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు రూబి స్టివెన్‌సన్, ప్రధాన కార్యదర్శి తెలంగాణ వెంకన్నలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బాగ్ అంబర్‌పేట్‌లో జరిగిన సంక్షేమ సమితి కార్యవర్గ సమావేశంలో పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసువచ్చారు. అదే విధంగా స్వరాష్ట్రసాధనలో సర్వం కోల్పోయిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉద్యమకారుల పిల్లల చదువులు కోసం సిఎం కెసిఆర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఉద్యమకారులకు ప్రతినెలా 5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు లేదా ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అలాగే వారికి వైద్య సౌకర్యాలు కల్పించి వారి ఆరోగ్యజీవనోపాధికి భరోసా కల్పించాలన్నారు. అంతేకాకుండా ప్రభు త్వ పథకాలల్లో అర్హులైన ఉద్యమకారులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో రాష్ట్ర కోశాధికారి బి.రాంచందర్‌గౌడ్, ఉపాధ్య క్షులు కె.శశిధర్ శిల్ప, కార్యవర్గ సభ్యులు బంగారి శ్రీనివాస్, జహంగీర్, జి.అమర్‌నాథ్, సభ్యులు జాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కట్నం వేధింపులకు వివాహిత ఆత్మహత్య

సరూర్‌నగర్, ఆగస్టు 26 ప్రభాతవార్త: అదనపు కట్నం కోసం అత్తింటి వారు పెడుతున్న వేధింపులు భరించలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం జిల్లెలగూడ కమలానెహ్రూనగర్‌కు చెందిన జింకల శంకరయ్య కూతురు కవిత వివాహం గత ఏడాది గుండేటి బాలరాజుతో జరిగింది. పెళ్ళయిన కొన్ని నెలలకే భర్తతో పాటు అత్తమామలు అదనపు కట్నం కోసం పెడుతున్న శారీరక, మానసిక వేధింపుల నేపథ్యంలో సరూర్‌నగర్ ఉమెన్ పిఎస్‌లో కవిత ఫిర్యాదు చేసింది. ఈ పరిస్థితుల్లో గత ఐదు నెలల నుండి పుట్టింట్లో ఉంటున్న ఆమె జీవితంపై విరక్తి చెంది ఆదివారం సాయంత్రం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. దీంతో హుటాహుటిన ఒవైసీ ఆసుపత్రికి అక్కడి నుండి ఉస్మానియా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు కవితను తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్లు ధృవీకరించారు. ఈ మేరకు మృతురాలు సోదరుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నకిలీ హిజ్రా అరెస్ట్

ధర్నాచౌక్, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త: ఒక మగ వ్యక్తి హిజ్రాగా వేషం వేసుకుని అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ హిజ్రాను ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్ తెలిపిన వివరాల సోమవారం సాయంత్రం ఒక హిజ్రా ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని రాంనగర్‌లోని షాపులలో యజమానులను బెదిరిస్తూ భయపెడుతూ డబ్బులు వసూలు చేయటం, డబ్బులు ఇవ్వకపోతే కస్టమర్స్ ఎదురుగా బట్టలు విప్పటం వంటి వికృత చేష్టలు చేస్తూ ఉండటంతో సమాచారం అందుకున్న పోలీసులు ఆ హిజ్రాను అదుపులోకి తీసుకున్నారు. ఆ హిజ్రాను విచారించే క్రమంలో అనుమానం వచ్చి గాంధీ హాస్పటల్‌కు తరలించగా అతను హిజ్రా కాదని, గుంటూరు జిల్లాకు చెందిన రమేష్ (23) అనే వ్యక్తి భిక్షాటన చేసుకుంటూ హిజ్రాగా అవతారం ఎత్తి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. రమేష్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 435 రూపాయలు రికవరీ చేసి, అతనిపై సెక్షన్ 384, 420, 341 ప్రకారం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇటీవల కాలంలో హిజ్రాల పేరుతో ఎక్కడ ఏ కార్యక్రమాలు జరిగినా అందరి ముందు పరువుతీస్తూ డబ్బులు బలవంతంగా వసూలు చేస్తూ ఉండటంతో బాధితుల ఫిర్యాదుల మేరకు వీరిపై దృష్టి పెట్టటం జరిగిందని తెలిపారు. నగర కమీషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేయటం జరుగుతోందని, ఇలాంటి అక్రమాలకు ఎవరైనా పాల్పడుతూ ఉంటే వారిని పోలీస్‌దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

బేగంపేట సెప్టెంబరు 26,ప్రభాతవార్త : ప్రశాంత వాతావరణంలో గణేష్ శోభాయాత్ర ,నిమజ్జనం జరిగే విధంగా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.మంగళవారం వివిధ శాఖల అధికారులతో కల్సి జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు.ముందుగా ప్యారడైజ్,ప్యాట్నీ సర్కిల్,బోట్లు క్లబ్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు ఏర్పాట్లపై తగు సూచనలు చేసారు.శోభాయాత్ర నిర్వహించే మార్గాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని,అవసరమైన ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జోనల్ కమీషనర్ రవికిరణ్,ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే,నార్త్‌జోన్ అడిషినల్ డీసీపీ మధుసూధన్,వాటర్‌వర్క్స్ సీజీఎమ్ ప్రభు,ఆర్ అండ్ బి ఈఈ రవీంద్ర మోహన్,జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్,మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్ గౌడ్,శీలం ప్రభాకర్,బీఆర్ఎస్ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్,ఆకుల హరికృష్ణ,అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు


ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి


ఐలమ్మకు నివాళులర్పిస్తున్న డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి


ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చల్లా నరసింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి

**వనస్థలిపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ చింతలకుంట చెక్‌పోస్ట్‌వద్ద ఆమె విగ్రహానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తికోసం ఐలమ్మ పోరాటం చేసిందన్నారు. మహిళలు ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ముద్రబోయిన శ్రీనివాస రావు, జిన్నారం విట్టల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, పద్మశ్రీనివాస్‌నాయక్, కర్మన్‌ఘట్ హనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**హయత్‌నగర్, ప్రభాతవార్త:** తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు, వీర నారి చాకలి ఐలమ్మ 128వ జయంతి వేడుకలను హయత్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర దళిత బహుజన రంగాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్ర రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్తించారు. కార్యక్రమంలో నాయకులు కొండమడుగు గణేష్, లింగం సురేష్, భాస్కర్, మహేష్, శ్రీను పాల్గొన్నారు.

**నివాళులర్పించిన మర్రి రాజశేఖర్‌రెడ్డి...**

**నేరేడ్‌మెట్, ప్రభాతవార్త:** ఐలమ్మ జయంతి సందర్భంగా వినాయక్‌నగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మల్కాజిగిరి బిఆర్ఎస్ పార్లమెంటు ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్, ప్రభాతవార్త:** అణచివేత, దోపిడి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ సంద చెరువు కట్టపై ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రజక సంఘంఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు అంజయ్య, నాయకులు రాజేందర్, దశరథ, బాలరాజ్, దుర్గేశ్, ఈశ్వర్, మహేశ్‌లతో పాటు మాజీ ఎంపిటిసి పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేవగోని కృష్ణ, చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, పుట్టగళ్ళ జగన్, ఆల శ్రీనివాస్‌రెడ్డి, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బాలాపూర్‌లో...** బాలాపూర్ రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా బిఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, గుండోజు రఘునందనాచారిలు ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వంగేటి మధుసూదన్‌రెడ్డి, అరవింద్‌గౌడ్‌లతో పాటు రజక సంఘం అధ్యక్షుడు యాదగిరి, శ్యామ్, అమ్జ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్.బి.నగర్, ప్రభాతవార్త:** అణిచివేత అధికమైనప్పుడు పోరాటం పురుడు పోసుకుంటుందని, దోపిడీ, అన్యాయాలు అధికమైనప్పుడు ఎదిరించడమే మార్గమంటూ ధైర్యాన్నే ఒక ఆయుధంగా మలచుకొని తన జీవితాంతం బానిస బతుకుల విముక్తి కోసం కృషి చేసిన మహోన్నత మానవతమూర్తి చాకలి ఐలమ్మ అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిలు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సరూర్‌నగర్ చౌడి వద్ద ఐలమ్మ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలమ్మ పోరాటం అణగారిన వర్గాల బతుకులపై జరుగుతున్న దోపిడీ, భూమి, బుక్కి, వెట్టి చాకిరి విముక్తి కోసం అన్నారు. ఈ కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, పున్న గణేష్‌నేత, చల్లా బాల్‌రెడ్డి, శంకర్‌యాదవ్, హైమద్, గుల్షన్, కిషోర్, చిన్న పాల్గొన్నారు.

# బాలాపూర్ గణేషునికి సిపి ప్రత్యేక పూజలు


బాలాపూర్ గణేషుడిని సందర్శించిన హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సివి ఆనంద్: చిత్రంలో మేయర్ పారిజాత తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలాల్లో ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణేషునికి హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సివి ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో గణేష్ విగ్రహాలు వెళ్లే రూట్ పరిశీలన నిమిత్తం బాలాపూర్‌కు పలువురు పోలీసు అధికారులతో కలిసి విచ్చేసిన ఆయన గణేష్ మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి కమీషనర్‌కు, పోలీసు అధికారులకు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బండారి మనోహర్, టేకుల శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా బిజెపి ఇసి మెంబర్‌గా వేణుగోపాల్‌రెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యునిగా మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ రాఘవేంద్రనగర్‌కు చెందిన పి.వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు నియామకపు ఉత్తర్వులు జారీ చేసి వేణుగోపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, పెండ్యాల నర్సింహ, కోడూరు సోమేశ్వర్, గాజుల మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథులకు నవరాత్రి పూజలు


గణనాదుడికి పూజలు చేస్తున్న బుల్లెట్ శ్రీను భక్తులు

**నాచారం, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త :** నాచారం వీఎస్‌టీ కాలనీలో ఆర్‌యూ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడిని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బుల్లెట్ శ్రీను ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అవరాల రాజ శ్రీనివాస్ యాదవ్ (బుల్లెట్ శ్రీను), నరేంద్రయాదవ్, మణికంఠ, సునీల్ గౌడ్, సాయిరామ్, పవన్, ప్రకాష్ రావు, శ్రీను, వరుణ్, రాజేష్, అరుణ్, గణేష్, సందీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# గణనాథుడికి భక్తి శ్రద్ధలతో పూజలు


గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జిన్నారం విట్టల్‌రెడ్డి


గణపతి పూజలో పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ మార్గదర్శి కాలనీలో మార్గదర్శికాలనీ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపాన్ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్‌సభ్యులు కుమార్, రఘు, చిన్న, మధుస్మైల్, ఆదిత్య, రీషి, నాయకులు గట్ల రవీంద్ర, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, విప్లవ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభాత్‌నగర్‌కాలనీలో...** చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిన్నారం విట్టల్‌రెడ్డి, జీవి.సాగర్‌రెడ్డిలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్జెల మధుసూధనరెడ్డి, డాక్టర్ బి.విజయరంగా, శోభారాణి, నాగలక్ష్మి, సుధాకర్, రమణారెడ్డి, జయశ్రీ, పావని పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి దేవాలయంలో అన్నదానం

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని శివ సాయినగర్‌కాలనీ శ్రీ గౌరీనీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్ గణేషునికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సుభాష్‌రెడ్డి, ఎస్ఐ గోవింద్‌స్వామి, సంక్షేమ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు బలరామ కృష్ణ, సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, లక్ష్మీగణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## మర్రి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ భారీ ర్యాలీ

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆనంద్‌బాగ్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. భారీస్థాయిలో వివిధపార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరికలుంటాయని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి మల్లారెడ్డి పాల్గొంటారని స్థానిక మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జీ బద్దం పరశురాంరెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీకార్పొరేటర్ జగదీష్‌గౌడ్, కార్పొరేటర్ మురుగేశ్, వెంకన్న, రాంచందర్, కృష్ణగౌడ్, కాటం రాజ్, భాగ్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి


పూజలు నిర్వహిస్తున్న వినోద్‌కుమార్, బాలకృష్ణయాదవ్ తదితరులు


డిసిపి రూపేష్‌ను సన్మానిస్తున్న సామ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి రూపేష్ పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్ గడ్డిఅన్నారంలో మహేందర్‌రెడ్డి యూత్ అసోసియేషన్ గణపతి మండపంవద్ద బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సామ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి డిసిపి రూపేష్‌తో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇంఛార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ తీగల సునరితతారెడ్డి, తీగల అజిత్‌రెడ్డి విచ్చేసి పూజలు నిర్వహించారు.

**వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో...** తెలంగాణ మిర్చి అసోసియేషన్ అధ్యక్షుడు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్‌కుమార్, జి.బాలకృష్ణయాదవ్ అక్బర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన గననాథుడివద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సతీష్‌కుమార్, అజయ్‌కుమార్, భాస్కర్, నాగేంద్రగౌడ్, పెద్ద సతీష్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఓల్డ్ మలక్‌పేటలో...** ముప్పిడి వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని భారీ ఊరేగింపుతో నిమజ్జనానికి తరలించగా, బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబు సుదర్శన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చుక్క కృష్ణ, నర్సింగ్‌రావు, ఫణిదర్ తదితరులు పాల్గొన్నారు.

**నాగోల్ పరిధిలో...** నాగోల్ పరిధిలోని పలు కాలనీలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను రాష్ట్ర పర్యటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆయనను నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు.

## గణనాథుడికి మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి పూజలు

**తుర్కయంజాల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** తుర్కయంజాల్‌లో రాధాకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్దకు బీఆర్ఎస్ రాష్ట్ర యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ యూత్ అధ్యక్షులు కొత్తకుర్మ కార్తీక్-శ్వేత దంపతులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుండా భాగ్యమ్మ ధన్‌రాజ్, నాయకులు చెవుల దశరథ, వస్పరి బాబయ్య, కొంతం యాదిరెడ్డి, మేతరి శంకర్, కొల్లూరు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానవ మృగాలకు ఉరి శిక్ష విధించాలని కొవ్వొత్తుల ప్రదర్శన


భవ్యశ్రీ మృతికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**తుర్కయాంజాల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లాలో గత వారం దారుణ హత్యకు గురైన మైనర్ బాలిక తోకల భవ్యశ్రీ మృతికి కారణమైన నిందితులకు ఉరిశిక్ష విధించాలని కోరుతూ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అంబేద్కర్ చౌరస్తా వద్ద కొవొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్‌లు మాట్లాడుతూ భవ్యశ్రీని అత్యాచారం చేసి, అతికూర్రంగా హత్య చేసిన నలుగురు కామాంధులను బహిరంగంగా ఊరి తీయాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం సీనియర్ నాయకులు గండికోట సత్యం, గండికోట కృష్ణ, నాయకులు నర్ర పాండు, నర్ర శ్రీధర్, వేముల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

**తుర్కయంజాల్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాగర్ హైవేలోని వివేకానంద చౌరస్తాలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను 22వ వార్డు అధ్యక్షుడు వేముల శంకర్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన జీవితాంతం బానిస బతుకుల విముక్తి కోసం కృషి చేసిన మహోన్నత మానవతమూర్తి చాకలి ఐలమ్మ రజాకార్లు, పెత్తందారుల నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడారని, ఆమె పోరాటం భావితరాలకు స్ఫూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు హనుమంత్‌గౌడ్, రాజునాయక్, కానుగుల గిరి, అంజయ్య, వేముల రాజు, కృష్ణ, పల్లె రాజు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం


గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** గౌడ సంఘం రాష్ట్ర కార్యాలయంలో పాత కమిటీ కాల పరిమితి ముగియడంతో రాష్ట్ర కోర్ కమిటీ అధ్వర్యంలో కొత్త రాష్ట్రకమిటీని ఏకగ్రవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షులుగా మామిడి రామకృష్ణగౌడ్, ప్రధానకార్యదర్శిగా బత్తుల రవీందర్‌గౌడ్, కోశాధికారి శ్రీమంతుల ప్రగతిగౌడ్, వర్కింగ్‌ప్రెసిడెంట్ మిట్టపల్లి విజయ్‌గౌడ్, గౌరవ అధ్యక్షులుగా పటేల్ వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మోరిగాడి ఉపేందర్‌గౌడ్, కట్కూరి శ్రీనివాస్‌గౌడ్, తాండ సూర్యనారాయణగౌడ్, ఆరే స్వామిగౌడ్, అధికార ప్రతినిధిలుగా బండమీది కనకరాజుగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా నాతి రాజేందర్‌గౌడ్, చందర్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గౌడకుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు


రామంతాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు


నివాళులర్పిస్తున్న బండారి నీలంరెడ్డి, కార్పొరేటర్ గీత, సరస్వతి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామంతాపూర్ రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన చాకలి ఐలమ్మ విగ్రహా ప్రతిష్టకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, ఎం.డి.ముస్తాక్, ఎం.దయాకర్‌రెడ్డి, రజక సంఘం నేతలు లింగయ్య, దానయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఉప్పల్ చౌరస్తాలో బిఆర్ఎస్ నేతలు ముదికొండ జగన్, గజ్జెల సత్యరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు బిఆర్ఎస్ నేత బండారి నీలంరెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్, మాజీకార్పొరేటర్ గోపు సరస్వతిసదానంద్, ఎస్ఐ మధుసూధన్, నెర్థం భాస్కర్‌గౌడ్, అంబటి జగదీష్, ఆకుల మహేందర్, మేకల మధు, బజారు జగన్, అన్య బాలకృష్ణ, పిల్లి నాగరాజు, మహిళా నాయకురాలు అనితారెడ్డి, శ్యామల, నాగేందర్‌రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి మధుయాష్కి గౌడ్ పూజలు

**వనస్థలిపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** బియన్.రెడ్డినగర్ డివిజన్ ఎస్‌కెడి నగర్‌లో బాలగంగాధర్ తిలక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడితో పలు కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు, వినయ్‌పటేల్, సామ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గణనాథులకు హన్మంతరావు పూజలు

**రామంతాపూర్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని పలు ప్రాంతాల్లోని వినాయక మండపాల వద్ద మంగళవారం బిజెపి సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ తిండేరు హన్మంతరావు పూజలు నిర్వహించారు. ఆర్టీసి కాలనీ, చర్చికాలనీ, వివేక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మండపాల వద్ద ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రామంతాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ స్వాగత వేదిక ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు మాలకొండారెడ్డి, ఉపాధ్యక్షుడు చెక్క శ్రీనివాస్‌రావు, చెన్నోజు హరీష్, కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి : తీగల అజిత్‌రెడ్డి


మట్టిని అందజేస్తున్న సునరితారెడ్డి, అజిత్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డిలు పేర్కొన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరా మిట్టి, మేరా దేశ్ కార్యక్రమాన్ని మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా బృంద సభ్యులు మూసారాంబాగ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి మట్టిని సేకరించారు. అనంతరం అజిత్‌రెడ్డి నివాసానికి విచ్చేయగా వారికి మట్టిని అందజేసి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర డైరెక్టర్ ఎఆర్ విజయరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాని న్ సెప్టెంబర్ 1 నుండి 30వ తేదీవరకు గ్రామాల్లో నిర్వహించి, అక్టోబర్ 1 నుండి 13వ తేదీవరకు మండలాల్లో సేకరించిన మట్టిని జాతీయ స్థాయిలో అక్టోబర్ 28నుండి నవంబర్ 1వరకు సేకరించిన మట్టిని జాతీయ ఐక్యత అమృతవాటిక, అమరవీరులకోసం నిర్మిస్తున్న స్థూపంలో ఉపయోగించబడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ సిటీ అధికారి ఖుష్బూ, డివిజన్ చల్లూరి రఘునందన్‌రెడ్డి, గౌర శశిధర్, సునిత్, గణేష్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ గణపతి లడ్డూలు దక్కించుకున్న భక్తులు


గణనాధుడి లడ్డూలతో నల్ల స్నేహల్‌రెడ్డి, బసిగూడెం సోమ్‌నాథ్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** వినాయక చవితి పండుగ సందర్భంగా భక్తుల పూజలందుకుంటున్న గణనాథుడి లడ్డూల వేలం పాటలు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రతినిత్యం పూజలందుకునే గణనాథుడి చేతిలోని లడ్డూను దక్కించుకుంటే సకల శుభాలు కలుగుతాయన్న విశ్వాసంతో భక్తులు లడ్డూలు దక్కించుకోవడానికి వేలం పాటలో జోరుగా పాల్గొంటున్నారు. చారిత్రక నేపథ్యం కలిగిన కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటుచేసిన గణనాధుడి మండపం వద్ద లడ్డూను రూ.1,01,116లకు బసిగూడెం సోమ్‌నాథ్‌రెడ్డి దకి ్కంచుకున్నారు. దేవాలయంలోని వినాయకుడి వద్ద ఉన్న లడ్డూను రూ.41,116లకు నల్ల సాహిత్‌రెడ్డి దక్కించుకున్నారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, కార్యనిర్వాణాధికారి శ్రీనివాసశర్మ చేతుల మీదుగా లడ్డూలను లాంఛనంగా అందజేసి తిరిగి గణనాథుల వద్ద ఉంచారు. 27న గణనాధుడి నిమజ్జన సమయంలో వారికి లడ్డూలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ధర్మకర్త బసిగూడెం జంగారెడ్డి, ధర్మకర్తలు చీర తిరుమలేష్, ఛాతిరి మధుసాగర్, బబ్బూరి ఆనంద్, గూడూరు మధుసూధన్‌రెడ్డి, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, చేగోని సురేష్ గౌడ్, మేకల యాదగిరితో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రఘుమారెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** తెలంగాణా సాయుధపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాటం నేటితరానికి స్ఫూర్తిదాయకమని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా బైగళ్ల రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంపాపేటలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముడుపు రాజిరెడ్డి, గూడూరు మదుసూధన్‌రెడ్డి, జంగయ్య, దొబ్బ గణేష్, శివ, రాములు, చంద్రయ్య, గౌతంరెడ్డి, పరమేష్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చంపాపేటలో...** ఐలమ్మ జయంతి సందర్భంగా చంపాపేటలో మొగిలిపువ్వు నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంపాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తోకటి కిరణ్, కారుకొండ శివ, చింటూ, రేండ్ల శివ, రామ్‌లక్ష్మణ్, గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.